జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 20-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 516 పేజీలు: 4 వెల: రూ.7



* మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు మృతి * బాతుపురం, పెదవంకకు చెందిన మెట్టూరి జోగారావు, నారాయణ * వారి కుటుంబీకులను పరామర్శించిన ప్రజా సంఘాలు, వామ పక్ష నేతలు * బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ చేయాలని డిమాండ్

# ఉలిక్కిపడిన.. ఉద్దానం






శ్రీకాకుళం, నవంబరు 19(వార్త): మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ మృతితో ఉద్దానం ఉలిక్కిపడింది. మెట్టూరి జోగారావుది వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. జోగారావు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మాజీ మావోయిస్టులు , మావోయిస్టు సానుభూతిపరులు, ప్రజా సంఘాలు, వామ పక్ష పార్టీ నేతలు బాతుపురానికి చేరుకున్నారు. మృతుని సోదరి శేషమ్మను పరామర్శించి ఓదార్చారు. జోగారావుకు ముగ్గురు సోదరులు ఇద్దరు తోబుట్టువులు ఉన్నారు. బాతుపురంలో 8వ తరగతి వరకు జోగారావు చదువుకున్నాడు. విప్లవ ఉద్యమాల వైపు ఆకర్షితుడై ఉద్దానం దళం లో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి ఆంధ్ర - ఒడిశా బోర్డర్ స్పెషల్ జోన్ కమిటీ మెంబర్‌గా, ఏవోబి స్పెషల్ జోన్ కమిటీ, కేంద్ర కమిటీ సభ్యులు, స్పెషల్ జోన్ కమిటీ ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఐఈడీల తయారీలో దిట్టగా పేరొందారు. భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకునేందుకు, జవాన్లు ప్రయాణించే వాహనాలను పేల్చేందుకు మావోయిస్టులు ఐఈడీలను సాధనంగా వినియోగిస్తారు. వీటిని అమర్చడంలో నైపుణ్యం కలిగిన టెక్ శంకర్ కొత్త టెక్నాలజీతో మందుపాతర్లను పేల్చడంలో నైపుణ్యం సంపాదించారు. అలాగే పెదవంక గ్రామానికి చెందిన చెల్లూరి నారాయణ అలియాస్ సురేష్ కూడా మృతి చెందాడు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన జోగారావు, నారాయణ మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ప్రజా, విప్లవ, పౌర హక్కుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు జడ్జి తో విచారణ చేయాలన్నారు.

# గృహహింస ఫిర్యాదులే ఎక్కువ

* లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన అవసరం * విద్యార్థినులు స్వయం రక్షణకు కరాటే నేర్చుకోండి * ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ * బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో సదస్సు



**శ్రీకాకుళం, నవంబరు19 (వార్త):** లైంగిక వేధింపుల చట్టాలపై మహిళలు అవగాహన చెందాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొనుటకు ఆచరించే విధానంపై నిర్వహించిన వర్క్ షాప్‌నకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎక్కువగా గృహ హింసకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. స్వయం రక్షణకు విద్యార్థులు కరాటే వంటి వాటిని నేర్చుకోవాలని చెప్పారు. మహిళలు పని చేయడానికి వెళ్లిన సమయంలో అక్కడ వేధింపులకు గురౌతున్నట్లు తెలిపారు. మహిళలు తమకు ఉండే మహిళా హక్కులు కాపాడుకోవాలన్నారు. సంఘటిత రంగాల్లోనే లైంగిక వేధింపులకు గురౌతున్నట్లు వివరించారు. మహిళలు తమకు జరుగుతున్న లైంగిక వేధింపులను ఫిర్యాదు చేయడానికి ముందుకు వచ్చి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కొందరు మహిళలు తమపై జరుగుతున్న వేధింపులను బయటకు చెప్పుకోలేక, పని మానుకోలేక సతమతమవుతున్నారన్నారు. పరిశ్రమల్లో పనిచేయడానికి మహిళలు వెళతారని అక్కడ వేధింపులు జరిగేందుకు అవకాశం ఉందని, అలాంటి ప్రాంతాల్లో లోకల్ కంప్లైంట్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. లైంగిక వేధింపుల చట్టం 2013లో తీసుకురావడమైనదని, ఈ చట్టం అమలుకు కృషి జరుగుతోందన్నారు. ఉద్యోగులకు కూడా ఈ చట్టంపై సరియైన అవగాహన లేదని తెలిపారు. జిల్లాల్లో లైంగిక వేధింపుల చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అసంఘటిత కార్మికులకు కూడా ఈ చట్టంపై అవగాహన ప్రతీ ఒక్కరిలో ఉండాలన్నారు. చట్టాలపై మహిళలకు అవగాహన ఉన్ననాడే లైంగిక వేధింపులు తగ్గుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మహిళలకు సురక్షితమైన ప్రాంతంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్. రజిని మాట్లాడుతూ లైంగిక వేధింపులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో లైంగిక వేధింపుల చట్టం చేసినట్లు తెలిపారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ కార్మికులు పనిచేసే చోట పది మంది మహిళలు కంటే ఎక్కువ ఉంటే స్థానిక కంప్లైంట్ కమిటీలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నారీమణి మాట్లాడుతూ మహిళల సమస్యలు చైర్ పర్సన్‌కు తెలపాలన్నారు. భీమునిపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెంకి సురేఖ మాట్లాడుతూ పనిచేసే చోట లైంగిక వేధింపులను మహిళలు ఎదుర్కొంటున్నారన్నారు. బెజ్జిపురం మనోవికాస కేంద్రం అధ్యక్షులు ప్రసాదరావు మాట్లాడుతూ మహిళల హక్కులకు భంగం వాటిల్లకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సలహా దారులు రావూరి సూయిజ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ విమల, ప్రొఫెసర్ సోషల్ వర్కర్ యు.కావ్యజ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ వనజ, స్వచ్ఛంద సేవా సంస్థలు పాల్గొన్నారు.

## ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధనకు ఐసీఎంఆర్ ఆమోదం

* రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**సోంపేట, నవంబరు 19 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధన చేసేందుకు ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మూడేళ్ల కాల వ్యవధిలో ఈ పరిశోధన పూర్తి చేసేందుకు.. మూడు దశల్లో ఐసీఎంఆర్ రూ.6.2 కోట్లను గ్రాంటు రూపంలో ఇస్తుందన్నారు. శ్రీకాకుళం కిడ్నీ రీసెర్చ్ ప్రాజెక్ట్ పేరుతో ఈ పరిశోధన జరుగుతుందని తెలిపారు. కిడ్నీ వ్యాధుల మూలాలు కనుగొనడం ద్వారా ఉద్దానం ప్రాంతంలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని మంత్రి వివరించారు. అతి త్వరలోనే పరిశోధన ప్రారంభమవుతుందని తెలిపారు.

### కిడ్నీ వ్యాధితో భాస్కరరావు మృతి

సోంపేట మండలం తోటూరు గ్రామానికి చెందిన కోనేటి భాస్కరరావు (50) అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో బుధవారం మృతి చెందాడు. పలాస కిడ్నీ ఆసుపత్రిలో గత కొద్ది నెలలుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. మంగళవారం పరిస్థితి విషమించడంతో ఆసుపత్రి నుంచి ఇంటికి పంపించేశారు. బుధవారం ఆయన మృతి చెందారు.

# రైతు దేశానికి వెన్నెముక

* జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు
* పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు విడుదల









**నరసన్నపేట/జలుమూరు, నవంబరు19(వార్త):** రైతే దేశానికి వెన్నెముక అని, వారి సంక్షేమం, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పష్టం చేశారు. నరసన్నపేట మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన 'రైతు సంబరం' సభలో వారు జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వంద శాతం అమలు చేసి 'సూపర్ సక్సెస్' సాధించిందన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, వ్యవసాయ రంగం అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం నరసన్నపేట నియోజకవర్గంలో 37,741 మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తూ రూ. 24.71 కోట్ల విలువైన చెక్కును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పిఏసిఎస్ చైర్మన్లు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ అనుబంధ కమిటీల సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**టెక్కలి:** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఉత్తరాంధ్ర పట్ట భద్రులు శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు అన్నారు. టెక్కలి నియో జకవర్గ కేంద్రంలో ఆదిత్య కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన రైతు సంబర సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. రైతు దేశానికి వెన్నెముక అని అధిక శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధార పడుతున్నారని, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టెక్కలి నియోజకవర్గంలో 42 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు రూ.28.47 కోట్లు చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, ముఖ్య నాయకులు బోయిన గోవిందరాజు, బోయిన రమేష్, పినకాన అజయ్ కుమార్, ఎల్ ఎల్ నాయుడు, హనుమంతు రామకృష్ణ, వెలమల విజయలక్ష్మీ, వెలమల కామేశ్వరరావు, మట్ట సుందరమ్మ, తర్ర రామకృష్ణ, కూచిట్టి కాంతారావు, చాపర గణపతి రావు, కోల్ల లవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంఆర్‌పై అవగాహన

**సంతబొమ్మాళి, నవంబరు 19(వార్త):** యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై సీతానగరం గ్రామంలో ఆక్వా రైతులకు విశాఖపట్నంకు చెందిన ఎంపెడ అసిస్టెంట్ డైరెక్టర్ శిబాసిస్ మహంతి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబరు 18 నుంచి 24 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఏఎంఆర్‌తో కలిగే ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం, దాని వ్యాప్తిని అరికట్టేందుకు ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీఈడీఏ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అక్వాకల్చర్ తీర రాష్ట్రాల్లోని ఏఎంఆర్ ప్రాధాన్యం, మంచి ఆక్వా కల్చర్ నిర్వహణ పద్ధతుల అమలుపై అవగాహన కల్పించేందుకు భారీ స్థాయిలో ప్రచారం చేపట్టామన్నారు. ఆక్వా సాగులో ఎటువంటి సమస్య తలెత్తిన వెంటనే సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఏసీఎస్ఏ ఎస్-సీవో ఎస్.బాలాజీ, జిల్లా మత్స్య శాఖ అధికారి వై.సత్యనారా యణ, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డా.బాలకృష్ణ, సర్పంచ్ పి.బృందావతి రవికుమార్ రెడ్డి, వాడరేవు చిరంజీవి, నగిరి ఖగేశ్వర రావు, ఫీల్డ్ మేనేజర్ ఎం. విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కొంకడాపుట్టిలో చెరువు భూమి కబ్జా

### -సర్వే చేసిన అధికారులు



**మందస, నవంబరు 19(వార్త):** కొంకడాపుట్టి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామకంఠం చెరువులో భూకబ్జా జరిగిందని తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. దీనిపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. మండల సర్వేయర్ బొడ్డపాటి బాబూరావు ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. కొంకడాపుట్టి గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధిలో ఉన్న గ్రామ కంఠం చెరువు గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ కబ్జాలకు గురవుతుండ డాన్ని జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు సవర శివ, తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి తేజ కలిసి ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి చెరువును సర్వే చేసి, కబ్జాకు గురైన ప్రాంతాలను గుర్తించారు. ఆక్రమణలను త్వరలోనే తొలగిస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో తవిటినాయుడు, సర్వేయర్ గణపతి, టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి తేజ, మండల ఉపాధ్యక్షుడు శివ, కూటమి నాయకులు, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

## జి.సిగడాం ఎస్ఐగా సందీప్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



**జి.సిగడాం, నవంబరు 19(వార్త):** జి.సిగడాం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా వి.సందీప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు.

## పీఎం ఆవాస్ పథకంపై ఇంటింటా సర్వే



**సారవకోట, నవంబరు 19(వార్త):** కొమ్ముసరియాపల్లిలో బుధవారం పంచాయతీ కార్యదర్శి సింహాచలం ఆధ్వర్యంలో పీఎం ఆవాస్ పథకంపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హుల వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఆయన వెంట సర్పంచ్ లక్ష్మణరావు ఉన్నారు.

### చాపర రాధాకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్‌లో

## ఘరానా మోసం

*** పెట్రోల్ ధరకే డీజిల్ * సాంకేతిక లోపంతో జరిగిందని సాకు**



**మెలియాపుట్టి నవంబరు 19 (వార్త):** పెట్రోల్ ధరకే డిజిల్ అమ్మకం జరిగిన ప్రక్రియ మెలియాపుట్టి మండలం, చాపర గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే.. జలకలింగుపురం గ్రామానికి చెందిన నడిమింటి ఉమాపతి అనే వ్యక్తి చాపరలో ఉన్న రాధాకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్) లో 3800 రూపాయల డీజిల్‌ను తాను తీసుకువెళ్లిన క్యాన్ లో కొట్టించాడు. తక్కువరాగా మరో రెండు వందల రూపాయలు డీజిల్ క్యాన్‌లో కొట్టించాడు. అయినప్పటికీ డీజిల్ తక్కువగా వచ్చినట్లు సందేహం రావడంతో తానుకొనుగోలుచేసిన డీజిల్‌ను కొలమానంతో కొలిపించగా సుమారు 4 లీటర్లుకు పైగా తక్కువగా వచ్చింది. దీంతో బిల్ ఇవ్వమని అడుగగా డీజిల్ ధర 98.03, ఉన్నప్పటికీ పెట్రోల్ ధర





110.29గా నమోదై బిల్లు రావడంతో అక్కడే యజమాని ఆ బిల్లును చించేయడంతో ఎందుకు బిల్లును చించేశావని యజమానులను ప్రశ్నించగా ఎవరికి చెప్తావో చెప్పుకో అని నాకేం భయంలేదని నానా దుర్భాషలు అనడంతో బాధితుడు తీవ్ర మనస్థాపానికి గురై రెవెన్యూ, మీడియాకు సమాచారం అందించాడు. ఉదయం 9 గంటల ప్రాంతంలో జరిగిన ప్రక్రియకు సంబంధించి బంకు యజమాని అక్కడ జరిగే వ్యవహారానికి, చెప్పే సమాధానానికి పొంతన లేకపోవడంతో సుమారు నాలుగు గంటల సమయం అక్కడికి వచ్చిన రెవెన్యూ సివిల్ సప్లై పోలీస్ అధికారులకు ఏమి చెయ్యాలో తెలియని చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తూనికలు కొలతలు అధికారి, ఇండియన్ ఆయిల్ ఎస్ఓ వచ్చేంతవరకు ఎదురు చూశారు. అనంతరం పోలీసులు రెవెన్యూ, తూనికలు కొలతల శాఖ అధికారిని, ఇండియన్ ఆయిల్ సేల్స్ మేనేజర్ తదితరులు బంకు వద్దకు చేరుకొని అక్కడున్న వాటిని పరిశీలించారు. అనంతరం వచ్చిన ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ రాజీవ్ సిస్టమ్ పరిశీలించి సాంకేతిక లోపంతో డీజిల్ ధర కంటే పెట్రోల్ ధరతో బిల్లు నమోదై ఉందని అందుకే డీజిల్ తక్కువగా వచ్చిందని చెప్పారు. అయితే అక్కడికి వచ్చిన రెవెన్యూ, తూనికలు కొలతలు అధికారిని, ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ లు అక్కడ పరిశీలించిన దానిని స్టేట్మెంట్ రాసుకుని ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. బాధితుడు ఉమాపతి కొనుగోలు చేసిన డీజిల్ ను రెవెన్యూ అధికారులు తీసుకొని పెట్రోల్ బంకులో పెట్టి అనంతరం పెట్రోల్ బంకుకు తాళం వేశారు. ఈ సందర్శనలో తూనికలు కొలతల అధికారిని పి చిన్నమ్మి, ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ రాజీవ్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ కుమారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆశాలత, వీఆర్వోలు సోమేశ్వరరావు, రాజ్ కుమార్ లున్నారు.

# నువ్వులరేవు నిర్వాసితులతో చర్చలు

### -ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్య

### -నెరవేర్చేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి

**పలాస, నవంబరు 19(వార్త):** ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయడం జరిగిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు.పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం నువ్వుల రేవు గ్రామ వంతెన అప్రోచ్ రోడ్డు సంబంధించి ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులతో, గ్రామ సిబ్బంది, అధికారులతో కలిసి గ్రామంలో నెలకొని ఉన్న బృందావతి మాత దేవాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు ఏడేళ్లుగా పెండింగులో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేశానని చెప్పారు. పనులను వేగవంతం చేయడానికి తాను చొరవ తీసుకొని చెప్పారు. నిర్వాసితులను సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో అక్కడికక్కడే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరిగింది . దీనితో నువ్వులరేవు గ్రామం యొక్క రూపురేఖలు మారుతాయని తమ అభిప్రాయాన్ని వ్యక్త చేశారు. ఆయా గ్రామ ప్రజలు కూడా ఆనందాన్ని వ్యక్తం పరస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, తహసిల్దార్, ఆర్ అండ్ బి జెఇ విక్రమ్, టిడిపి నాయకులు పైరుకట్ల విఠల్, కణితి సురేష్, మాజీ



ఎంపీపీ గోరకల వసంత స్వామి, హేమబాబు చౌదరి, గోవింద్ పాపారావు, పోతనపల్లి సాంబమూర్తి, స్థానిక సర్పంచ్ పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీటీసీ వెంకటేష్ ఆనందు, మహిళా సంఘం నాయకురాలు చోంపమ్మ, ఇతర ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శివాజీపై తప్పుడు కూతలు కూస్తే చర్యలు

### 'బత్తిని లక్ష్మణ్'పై టీడీపీ నాయకుల ధ్వజం



**మందస, నవంబరు 19(వార్త):** రాజకీయాల్లోనే కాకుండా జీవితంలో కూడా ఒక్క మచ్చ లేని మంచి నాయకుడు గౌతు శ్యామసుందర శివాజీ అని, ఆయనపై ఆరోపణలు అసత్యమని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు శివాజీ అని, తప్పుడు కూతలు కూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, బత్తిని లక్ష్మణ్ పై టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో జరిగిన సమావేశంలో కార్గో ఎయిర్ పోర్ట్ కై ఏర్పాటు చేసిన సభలో బత్తిని లక్ష్మీనారాయణ అనే వ్యక్తి గౌతు కుటుంబంపైన తప్పుడు ఆరోపణలు మాట్లాడిన మాటలను ఖండిస్తూ ఈ పత్రికా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన మాట్లాడుతూ గౌతు శివాజీ సోంపేట ఏరియాలో 1000ఎకరాల ఆస్తిని దోచుకున్నారని అసత్య ఆరోపణలు ఆరోపించడం అన్యాయమన్నారు. ఈ నింద ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తే గౌతు కుటుంబం తరుపున మాటిస్తున్నామని, ఈ క్షణం నుంచే రాజకీయాలకు విడిచి పెట్టేస్తారన్నారు. లేని పక్షంలో మీ పైన తీవ్ర పరిణామాలు ఉంటుందని హెచ్చరించారు. మరికొంత మంది నాయకులు మాట్లాడుతూ, ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే, నడి రోడ్డు మీదకు తీసుకు వచ్చి ప్రజావేదికపైనే నిజనిజాలు రప్పించాల్సి ఉంటుందని ఘాటుగా హెచ్చరించారు. ఇదే పరిస్థితి మరోసారి జరిగితే తప్పక ప్రతిచర్య ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, పీఏసీఎస్ ఛైర్మన్లు తమరియ భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, ముడుముంచి నవీన్ కుమార్, పార్టీ నాయకులు బమ్మిడి కర్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, మంగళ పాత్రో, కొనారి తులసిరావు, శిర్ల కృష్ణారావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ




**ఇచ్ఛాపురం, నవంబరు19(వార్త):** ఇచ్ఛాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయుల కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు రెండురోజుల టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాలు మున్సిపల్ బాలికొన్నత పాఠశాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ లు గా మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం , రిసోర్స్ పర్సన్ గా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వైకుంటరావు వ్యవహరించారు. వివిద పాఠశాలనుంచి ఎన్నికైన 26 మంది ఉపాధ్యాయులకు మరియు సి అర్ ఎం టి లకు రెండురోజుల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశ బోధన మందింపు పై అబ్జర్వేషన్ కొరకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించుటకు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలు పేపొందుటకు ఈ శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఇరువురు మండల విద్యాశాఖాధికారులు కురమాన అప్పారావు , ఎస్ విశ్వనాథంలు తెలిపారు. రిసోర్స్ పర్షన్ కు, ఉత్తమ పార్టిసిపెంట్ లకు సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ బాలికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'ఆదిత్య' ఆధ్వర్యంలో ఉమాగిరిలో వైద్య శిబిరం



**మందస, నవంబరు 19(వార్త):** ఉమాగిరి గ్రామంలో బాలిగాం ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉమాగిరి గ్రామంలోని ప్రజలు, వృద్ధులకు సంబంధించి బీపీ, షుగర్, రక్త పరీక్షలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ ఆదిత్య కళాశాల విద్యార్థులు గ్రామంలో వైద్య కార్యక్రమాలు నిర్వహించడంతో ఎంతో మందికి మేలు జరిగిందని, ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించినందుకు కళాశాల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు సేవాభావం పెంపొందించాలని, విద్యార్థులు వలంటీర్లుగా సేవా కార్యక్రమాలు చేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమానికి సంబంధించిన అధికారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వనజకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శిస్తు బాపూజీ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, ప్రిన్సిపల్ బొంగి ప్రవీణ్, డాక్టర్ భారతి, జ్యోతి, ఏఎన్ఎంలు, స్థానిక ఆశ వర్కర్లు, పీఓ మన్మధరావు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడాలి



**జలుమూరు, నవంబరు 19(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. బుధవారం జలుమూరు మండలం సుబ్రహ్మణ్యపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు.విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాదానాలు రాబట్టారు. ప్రతి రోజు తప్పనిసరిగా వర్క్ బుకు విద్యార్థులకు అందజేయాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు అందించారు.

## ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి



**పోలాకి, నవంబరు 19(వార్త):** ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నియమావళి నుంచి మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. బుధవారం సాయంత్రం పోలాకి, మబగాం, ఈదులవలస పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. డీఎస్సీ ద్వారా కఠిన పోటీని ఎదుర్కొని ఎంపికైన ఉపాధ్యాయులకు మరోసారి అర్హత పరీక్షలు విధించడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యా యుల సమస్యలను త్వరగా పరిష్కరించాలంటూ ప్రభుత్వాన్ని కోరారు.

## లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం



**నరసన్నపేట, నవంబరు 19(వార్త):** నరసన్నపేట పట్టణం పెద్దపేట వీధి ప్రజలు గత కొంతకాలంగా లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు లైన్ ఇన్స్పెక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ నియంత్రక ఏర్పాటు చేసి విద్యుత్ లైన్ల మార్చారు. స్థానిక వాసులు విద్యుత్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

## చంటి పిల్లలలను అనాథలుగా చేయొద్దు



**నరసన్నపేట, నవంబరు 19(వార్త):** సమాజంలో కొన్ని కారణాలతో వివాహం జరగకుండా గర్భం దాల్చడం, పేదరికంతో ఉండడం తదితర అంశాలలో వారి చిన్నారులను అనాథలుగా పడి వేస్తున్నారని ఐసీపీఎస్ ప్రతినిధులు గీత, జనార్ధన్ తెలిపారు. బుధవారం నరసన్నపేట ఏరియా హాస్పిటల్లో ఆశా వర్కర్లు, స్థానిక రోగులు సిబ్బందితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరియా హాస్పిటల్లో ప్రత్యేకంగా "ఊయల" ఏర్పాటు చేశామన్నారు. దీనిలో వేస్తే రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

## గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలు

**మందస, నవంబరు 19(వార్త):** మందసలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థినిలకు రంగవళ్ళుల పోటీలు నిర్వహించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ అధికారిణి జె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముందుగా సూర్యోదయ స్కూల్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, విద్యార్థులు మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయ పాఠకులు, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆర్డీవోను కలిసిన మున్సిపల్ కమిషనర్



**పలాస, నవంబరు 19(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి ఇటీవల నియమితులైన కమిషనర్ శ్రీనివాసులు ఇటీవల విధులు స్వీకరించిన తరువాత పలాస ఆస్థాన ఆర్డీవో జి వెంకటేష్ ను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పలాస కమిషనర్ మాట్లాడుతూ ప్రముఖంగా ప్రాజెక్టుల పురోగతి, పట్టణ అభివృద్ధిపై చర్చులు తెలిపారు . మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు నియామకం అనంతరం పలాస నియోజక వర్గంతో ముడిపడిన అధికారులను మర్యాదపూర్వకంగా కలుస్తూ, అభివృద్ధి పనులను సమీక్షించారు. మున్సిపల్ పరిపాలనలో భాగంగా, ముఖ్యమైన నీటి సరఫరా వంటి కీలక అంశాలపై మున్సిపల్ అధికారుల సమన్వయాన్ని చేస్తున్నమన్నారు. ఈ నేపథ్యంలో, ఆర్డీవోను కలిసిన కమిషనర్ మర్యాదపూర్వకంగా ప్రభుత్వ ఇతర అధికారులతో సమన్వయాన్ని చేసుకొని తదుపరి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసేట్ల తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవ మాట్లాడుతూ శానిటేషన్ విషయంలో కచ్చితంగా వ్యవహరించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దవలసిందిగా సూచించారు. నివాస ప్రాంతాలలో పారిశుధ్య చర్యలు ఖచ్చితంగా పాటించి పట్టణాన్ని శుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచాలన్నారు. ఇందుకోసం వ్యక్తిగతం, సామూహికంగా అనుసరించాల్సిన కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# ప్రజా ప్రతినిధులంటే అంత చులకనా?

### -మండల సమావేశాలకు పూర్తిస్థాయిలో హాజరుకాని వివిధ శాఖల, ఇంజనీరింగ్ అధికారులపై సభ్యుల ధ్వజం




**పలాస, నవంబరు 19(వార్త):** పాకిస్తాన్లో ఉన్నామంటూ ఇంజనీరింగ్ అధికారి నరసింహమూర్తిపై వైస్ ఎంపీపీ తొలగాన శ్రీరాములు మండిపడ్డారు. ఎంపీపీఉంగ ప్రవీణ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జవాబుదారుతనంగా పనిచేయడం లేదని, గ్రామాల్లో అభివృద్ధి పనులు కోసం పంచాయతీ కార్యాలయాలకు వెళ్లే ప్రజా ప్రతినిధులకు సరైన గౌరవం కూడా దక్కడం లేదని వైస్ఎంపీపీ తలగాన శ్రీరాములు పంచాయతీరాజ్ శాఖాధికారులను ప్రశ్నించారు. సమావేశంలో మండల వైస్ఎంపీపీ టి.శ్రీరాములు మండల ఇంజనీరింగ్ విభాగ అంశంపై చర్చలో పంచాయతీ అధికారి నర్సింహమూర్తిని ప్రశ్నిస్తూ పనులపై కార్యాలయంనకు వచ్చినప్పుడు సరైన రీతిలో సమాధానం చెప్పాలని, జవాబుదారీ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మండల సమావేశాలకు పంచాయతీరాజ్శాఖకు సంబంధించి దిగువస్థాయి అధికారులు మాత్రమే హాజరవుతున్నారని ఇది సరైనది కాదన్నారు. పంచాయతీరాజ్ కార్యాలయాల్లో ఏ పనులు మీద వచ్చారని అడిగే నాధుడు కరువయ్యాడని, పనులపై వచ్చేవారికి దురుసుగా ప్రవర్తించడం తగదని హితవు పలికారు. వ్యవసాయశాఖ అంశంపై ఎవో పోలారావును చినంచల ఎంపీటీసీ సభ్యుడు దుర్యోదనరావు ఈకెవైసీ అంశంపై ప్రశ్నించగా ఈ ఏడాది మండలంలో 12వేల 613 ఎకరాలకు చెందిన వివిధ భూముల రైతుల పేర్లు ఈ-క్రాప్లో నమోదు చేశామని, డేటా ప్రకారం వారి పేర్లను నమోదు చేశామన్నారు. మండలంలో 13 సచివాలయ కేంద్రాలను పాడి ప్రొక్యూర్మెంటు ఎంపిక చేశామని, అక్కడి రైతుసేవా కేంద్రాల ద్వారా ఆయా పంచాయతీల్లో వివరాలను రైతులు నమోదు చేసుకుంటే ధాన్యం బస్తాలను వివిధ మిల్లులకు తరలించవచ్చునన్నారు. ఇరిగేషనాశాఖ అంశంపై జెఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ లొత్తూరు వరహాలగెడ్డకు సుందరీకరించేందుకు రూ.కోటి 50 లక్షలతో ప్రతిపాదనలు చేపట్టేందుకు ప్రభుత్వంనకు తెలియజేశామని, దీనిపైనరప్లస్వియరు నూతనీకరణ చేసి గెడ్డను లోతుచేసి రైతులకు ఉపయోగకరంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంచేశామని సభలో తెలిపారు. అనంతరం హౌసింగ్, వెలుగు, ఐసీడీఎస్.జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, విద్య విద్యుత్ అంశాలపై సమావేశంలో అధికారులు చర్చించారు. కాగా సమావేశంనకు ఆర్ద్బ్యుఎస్, అటవీశాఖ అధికారులు హాజరుకాలేదు. సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోయినా సరైన చర్యలు తీసుకోకపోవడంతో వివిధశాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరవుతున్నారనే వాదన వినిపించింది. సమావేశంలో ఎంపీడీవో ఎన్.వసంతకుమార్, తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, ఉప మండలాభివృద్ధి అధికారి మెట్ట వైకుంఠరావు, వెలుగు ఎపిఎం జాంబవతి, ఐసిడిఎస్ పివో పార్వతి తదితరులు పాల్గొన్నారు.




## కేళీల నష్టపరిహారం వెంటనే అందించాలి

### -వైసీపీ రాష్ట్ర కార్యదర్శి శ్యాం ప్రసాద్ రెడ్డి



**సోంపేట, నవంబరు 19(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఖరీఫ్లో సాగు చేసిన వరి పంటకు సంబంధించి అధికంగా పంటలో కేళీలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అటువంటి నష్టాన్ని అంచనా వేసి రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ మునిజీర్నీ బుధవారం గుంటూరులో కలిసి ఇక్కడ రైతుల స్థితిగతులను వివరించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డిని కూడా కలసి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వరి పంట స్థితిగతులను వివరించినట్లు తెలిపారు. వరి పంటలో కేళీలు రావడం అంటే విత్తనాల్లో నాణ్యత లేదని నాగిరెడ్డి పేర్కొన్నట్లు తెలిపారు. దీనివలన పంట దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఇటువంటి నాణ్యతలేని విత్తనాలు విక్రయించడమే పెద్ద నేరమని అందుకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాగిరెడ్డి పేర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయంలో వైయస్సార్సీపి తరఫున రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాటం చేద్దామని అన్నట్లు శ్యాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

## భూ ఆక్రమణలపై కమిషనర్ కొరడా

### -హుద్హుద్ ఇళ్ల వద్ద రోడ్డు ఆక్రమణను తొలగించిన మున్సిపల్ అధికారులు



**పలాస, నవంబరు 19(వార్త):** హుద్ హుద్ ఇండ్ల వద్ద రోడ్డు ఆక్రమణ ను తొలగించిన మున్సిపల్ అధికారులు. పలాస-కాశీ బుగ్గ పురపాలక సంఘం 19వ వార్డు సూది కొండ కాలనీకి అనుకొని ఉన్న హుద్ హుద్ ఇండ్ల వద్ద రోడ్డు ఆక్రమణ జరిగినట్లుగాను సదరు ఆక్రమణను తొలగించవలసిందిగా పలాస ఎమ్మెల్యే ఆదేశించడంతో పలాస నియోజకవర్గం వారి కార్యాలయం నుండి వచ్చిన లేఖ పై పురపాలక సంఘ కమిషనర్ ఐ శ్రీనివాసులు బుధవారం తమ కార్యాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించి జెసిబి సహాయంతో సదరు రోడ్డు ఆక్రమణను తొలగించారు. వరద కాలువలో ఆక్రమణ తొలగించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని లేబర్ కాలనీ ఎదురుగా ఉన్న పురుషోత్తపురం సర్వే నం. 57/1 లో గల వరద కాలువను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి పునాదులు వేసినట్లుగా పత్రికలలోను, ఈ కార్యాలయమునకు వచ్చిన ఫిర్యాదులపై పురపాలక సంఘ కమిషనర్ తన సిబ్బందితో సదరు ఆక్రమణను తొలగించారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వచ్చే వరద కాలువను గతంలో సుమారు 5 కోట్ల రూపాయలు విలువ చేసే స్థలంను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించి పునాదులు వేశారని ఆక్రమణ విషయం తమ దృష్టికి వచ్చినట్లుగాను, వెంటనే పలాస తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని జెసిబి సహాయంతో ఆక్రమణ వద్దకు వెళ్లి ఆక్రమించిన పునాదులు తొలగించినట్లుగా కమిషనర్ ఇ. శ్రీనివాసులు తెలియజేశారు. ప్రభుత్వ భూములను ఎవరైనా అతిక్రమించి ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని కమిషనర్ హెచ్చరించారు.



## జిల్లాలో 18 పీహెచ్సీల పునఃప్రారంభం

### -మరో ఆరు కేంద్రాల నవీకరణకు సిద్ధం

### -జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి అనిత



**జి.సిగడాం, నవంబరు19(వార్త):** ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించా లని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డా.కె.అనిత అన్నారు. డాక్టర్ రెడ్డీస్ వారి ఆర్థిక సహకారంతో ఆధునీకరించిన బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమెతో పాటు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్-హెల్త్ సత్తి.శ్రీనివాస్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలనే ఉద్దేశ్యంతో మారుమూలలలో ఉన్న పిహెచ్ సిలను సుందరీకరణ చేసి, అన్ని ఆధునిక సౌకర్యాలతో, డాక్టర్ రెడ్డీస్ వారు అభివృద్ధి చేసారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలానే లేబర్ రూమ్ మరియు లేబరేటరీలను అత్యాధునిక సదుపాయలు కల్పించారని, ఉచితంగా రక్త పరీక్షలు, ప్రసవాలు చేస్తారని వీటిని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్-హెల్త్ సత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఇదే స్థాయిలో ఆధునికరించామని మరొక 6 పిహెచ్ సి లు పనులు నవీనికరణకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలానే నర్సింగ్ స్టాఫ్ కి ప్రసవాలు జరుపటానికి, అత్యవసర చికిత్సలు అందించటానికి కావలసిన నైపుణ్య శిక్షణను అందిచామని అన్నారు. ఈ కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ అనూష, డాక్టర్ ప్రతిష్ఠ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది సురేష్, నవీన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సేవాభావాలు పెంపొందించడమే..

# ఎన్ఎస్ఎస్ లక్ష్యం




**మందస, నవంబరు 19(వార్త):** విద్యార్థుల్లో సేవాభావాలు పెంపొందించడమే ఎన్.ఎస్.ఎస్ లక్ష్యమని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, మందస మండల విద్యాశాఖ అధికారి ఎం.లక్ష్మణరావు అన్నారు. మందస మండలంలోని హరిపురం శాతవాహన జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం మందస మండలంలోని బైరిసారంగపురం గ్రామంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సామాజిక సేవలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు ఒక మెరుగైన వ్యక్తిగా, పూర్తిస్థాయి పౌరులుగా అభివృద్ధి చెందుతారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా చేసి దేశభక్తిని, సేవా గుణాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో ఎన్ఎస్ఎస్ ఏర్పాటైందన్నారు. విద్యార్థుల కర్తవ్యాలను గుర్తు చేస్తూ విద్యను అభ్యసించడమే కాకుండా సామాజిక సేవ ద్వారా విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నదే ఎన్ఎస్ఎస్ లక్ష్యం అన్నారు.

కార్యక్రమంలో శాతవాహన విద్యాసంస్థల ఏఓ బి.శివ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.దుదిష్టి నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ పి.ఓ ఎన్.రామ కుమార్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేడీఎస్ ప్రసాద్, సర్పంచ్ ప్రతినిధి రట్టి గణేష్, ఎంపీటీసీ ప్రతినిధి మట్ట షణ్ముఖరావు, ఉప సర్పంచ్ గుసిరి తాతయ్య, గ్రామ పెద్దలు మన్మధరావు, మట్ట మాధవరావు, కె.పున్నయ్య, గ్రామ పెద్దలు, యువత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




## తిమడాంలో రెవెన్యూ గ్రామసభ



**జలుమూరు, నవంబరు 19(వార్త):** తిమడాం సచివాలయంలో స్థానిక రైతులతో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. బుధవారం వీఆర్వో రామారావు సమక్షంలో మండల సర్వేయర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామస్థులు వారి పొలాలకు సంబంధించి సరిహద్దు వివరాలను అందించాలని తెలిపారు. రెండవ విడత రీ సర్వేకు ప్రజలు రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. సర్పంచ్ అసిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేరణ మిత్రపై వర్క్షాప్ ప్రారంభం




**పలాస, నవంబరు 19(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "ప్రేరణ మిత్ర పైలట్ ప్రాజెక్ట్ కోసం" సరైన స్థాయిలో బోధించడం రెండు రోజుల వర్క్షాప్ బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ యూనిసెఫ్ శేషగిరి మధుసూదన్ హాజరయ్యారు. మండలంలోని పాఠశాలల హెడ్మాస్టర్లు, టీఏఆర్ఎల్ టీమ్ సభ్యులు, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు అప్పారావు, ప్రియాంక వర్క్షాప్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆహ్వానితులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి వర్క్షాప్ను ప్రారంభించారు. ప్రేరణ మిత్ర పైలట్ ప్రాజెక్ట్ కోసం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ పలాస ఎంపిక కావడం ఒక సువర్ణ అవకాశం అని, ఈ అవకాశాన్ని కళాశాల విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ముఖ్య అతిథి శేషగిరి మధుసూదన్ మాట్లాడుతూ"పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5వ తరగతి విద్యార్థుల మనసులు చాలా సున్నితమైనవిని, వారిని ఎంతో ఓర్పుతో, ప్రేమతో శిక్షణ వైపుకు ప్రేరణ కల్పించడం అత్యంత ముఖ్యము అని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా స్టేట్ ప్లానింగ్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్ కల్పన సైలస్, కోఆర్డినేటర్, శిక్షణ ఫౌండేషన్ రమ, అతిథిగా పలాస ఎంఈఓ సిహెచ్. సత్యం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ పట్నాయక్, బిసిడిఈ కోఆర్డినేటర్ దీపకుమారి, ప్రేరణ మిత్ర ప్రాజెక్టుకు ఎంపికైన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విశాఖ డెయిరీ పాడి రైతుకు బీమా పరిహారం



**కంచిలి, నవంబరు 19(వార్త):** కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామానికి చెందిన పాడి రైతు సూర్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి విశాఖ డెయిరీ యాజమాన్యం 30 వేల రూపాయల చెక్కును బుధవారం అందజేశారు. సదర్ రైతు ఎంతోకాలంగావిశాఖ డెయిరీకి పాలను సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డెయిరీ సభ్యునిగా రైతు మరణించడంతో బాధిత కుటుంబానికి బుధవారం గ్రామంలో మాజీ సర్పంచ్ మాదిన రామారావు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సహాయంపై శ్రీరాంపురం గ్రామస్తులు విశాఖ విశాఖ డెయిరీని అభినందించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ సూపర్వైజర్లు వేణుగోపాల్, స్వామినాయుడు, స్థానిక టీడీపీ యువ నేత మాదిన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం.. పరిశుభ్రతే లక్ష్యం





**జి.సిగడాం, నవంబరు 19(వార్త):** పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు పచ్చదనం పరిశుభ్రతతో గ్రామాలు విరాజిల్లినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో జి.రామ కృష్ణారావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో క్లీన్ అండ్ గ్రీన్పై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములు చేస్తూ, వారికి మెరుగైన అవగాహన కల్పించేవిధంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించి గ్రామాలను పచ్చ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడు తులసీ సాహు, మహిళా అధ్యక్షురాలు రౌతు చైతన్యకుమారి, వెంకటనాయుడు, వడగ గౌరీశంకర్, రాజారమేష్, దుర్గారావు, సాయికిషోర్, ఝాన్సీ, ధనలక్ష్మి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని ఇందిరకు ఘన నివాళి

**సోంపేట, నవంబరు 19 (వార్త):** భారత మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ విగ్రహానికి సోంపేటలో బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ ప్రధానిగా దేశాభివృద్ధికి చేపట్టిన సంస్కరణలు హర్షణీయమని అన్నారు. బ్యాంకుల జాతీయ కరణ వీట్లో ఒక ముఖ్యమైన సంస్కరణగా పేర్కొన్నారు. నిరుపేదరికంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న భారతదేశాన్ని అభివృద్ధి మార్గంలో పయనించేందుకు ఇందిరమ్మ చేపట్టిన కార్యక్రమాలు అప్పటి ప్రజలకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దు సర్వేశ్వరరావు, దుప్పల చలపతి, ఎలమంచి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కన్నెపూజ మహోత్సవం



**సోంపేట, నవంబరు 19 (వార్త):** సోంపేటలోని డాబా కాలనీలో బుధవారం అయ్యప్ప స్వాముల కన్నెపూజ మహోత్సవం ఎంతో వైభవంగా కన్నుల పండువుగా నిర్వహించారు. అయ్యప్ప భక్తుల గురు స్వామి పొట్లబుజ్జి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామి మాలను మొట్టమొదటిసారిగా ధరించిన భక్తులు కన్నె స్వామి పూజను నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇటువంటి పూజా మహోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించడం పట్ల డాబా కాలనీవాసులు అయ్యప్ప స్వాములను ఎంతగానో అభినందించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

## వరిలో కేళీల సమస్య



**ఇచ్ఛాపురం, నవంబరు 19(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలోని ముఖ్యంగా సోంపేట మండలంలోని రైతుల వరి పంట పొలాలలో 'కళిలు అధికంగా ఏర్పడిన పరిస్థితిలు పై పూర్తి స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులచే పరిశీలన చేయించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోగలరని అగ్రికల్చర్ డైరెక్టర్ మనజిర్ జిలాని సమూన్ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి చెప్పారు. అదేవిదంగా సదరు అంశంపై రైతులకు జరిగిన నష్టంపై వైస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం..రైతు సంక్షేమం), మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్, నాగిరెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు చెప్పారు., స్పందించి అసలు వరిలో కేళిలు రావటమంటే విత్తనాలు ప్యూరిటీ లేనివిగా పరిగణించాలి..ప్యూరిటీ లేని విత్తనాలు రైతులకు అమ్మటమే తప్పు..కేళీలు వస్తే దిగుబడి తగ్గుతుంది అని రైతు లందరికి తెలిసిన విషయమే అటువంటిది మరలా పంట కోత ప్రయోగం తరువాత నష్టం అంచనా వేయడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు, కేళీ విత్తనాలు అమ్మినందుకే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి..అధికారులు వ్యవహారం గమనిస్తే రైతు లకు న్యాయం చేసేలా ప్రయత్నం చేయటం లేదని అనుకోవలసి వస్తుంది సందేహం వ్యక్తం చేశారు. సదరు అంశాన్ని మొదటగా నష్ట పోయిన రైతులు స్వయంగా సంబంధిత అధికారులకు సమస్యపై పిర్యాదు చేయించిన పిమ్మట ఆ పిర్యాదు ఆధారంగా వైస్సార్సీపీ రైతులకు తోడుగా నిలబడి న్యాయం జరిగేవిధంగా ప్రయత్నం చేస్తామని అన్నారు.

## ఆసుపత్రుల సమస్య పరిష్కరించండి



**ఇచ్ఛాపురం, నవంబరు 19(వార్త):** నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రిల సమస్యలు పరిష్కరించాలని సౌరబ్ గౌర్ (కార్యదర్శి, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ) ను విజయవాడ కార్యాలయంలో సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కలసి కోరారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ సామజిక ఆసుపత్రి అవసరాలు. బారువ సామజిక ఆసుపత్రి పెండింగ్ పనులు. మారుమూల ప్రాంతమైన కవిటి ప్రభుత్వ ఆసుపత్రి నందు డాక్టర్స్ చేరేందుకు అలవెన్సు లు ఏర్పాటుకు చర్చించారు. నియోజకవర్గం కేంద్రం ఇచ్ఛాపురం పట్టణం నందు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నందు సరిపడా వైద్యులు మరియు సపోర్టింగ్ సిబ్బంది లేక రోగులకు ఇబ్బంది కలుగుతుంది. అదేవిదంగా అడ్మిట్ అయ్యే రోగులకు ఆహారం అందివ్వడం లేదనిజనరేటర్ అందుబాటులో లేనందువలన వైద్య సేవలకు ఇబ్బందులు కలుగుతున్నదని ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికి చిన్నపాటి పెండింగ్ పనులు వలన అందుబాటులో లేదు,ఆక్సిజన్ సిలిండర్ల పై ఆధారపడే పరిస్థితి, పైన పేర్కొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. బారువ నందు నాబార్డ్ నిధులు 655 లక్షలురూపాయలు అంచనా వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆసుపత్రి నిర్మాణ పనులు చివరి దశలో ఆపివేయడం జరిగిందని పెండింగ్ పనులు పూర్తి చేసి సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకుని రాగలరని కోరారు.ఇచ్ఛాపురం నియోజకవర్గం నందు ప్రస్తుతం డయాలసిస్ కేంద్రాలు సోంపేట ,కవిటి మరియు ఇచ్ఛాపురం నందు గలవు వీటి సామర్ధ్యం మించి పెరుగుతున్న డయాలసిస్ స్టేజి కిడ్నీ రోగులకు వెయిటింగ్ లిస్ట్ లో ఉంచడం జరుగుతుందని, ఈ ప్రాంతంలోని కిడ్నీ వ్యాధి రోగులకు సరిపడా డయాలసిస్ సేవలు అందించేందుకు బారువ నందు కొత్త ఆసుపత్రి నిర్మాణం జరిగిన తరువాత పాత ఆసుపత్రి ని డయాలసిస్ కేంద్రం గా ఏర్పాటు చేయాలని గతంలో చర్యలు తీసుకున్నారు కావున ప్రస్తుతం నిర్మాణంలో గల ఆసుపత్రి పనులు మరలా ప్రారంభించి పనులు వేగవంతం చేయగలరనికోరారు.మారుమూల ప్రాంతమైన కవిటి మండల కేంద్రంలో సి హెచ్ సి లో డాక్టర్స్ చేరేందుకు ఆసక్తి చూపడం లేదు, ఇక్కడ వైద్యులు చేరేందుకు గాను గిరిజన ప్రాంతాలలో వైద్యులకు ఇచ్చే ప్రత్యేక అలవెన్సు లు సదుపాయాలు కల్పించాలని అదేవిదంగా కవిటి డయాలసిస్ కేంద్రం నందు నెఫ్రోలాజిస్ట్ నియామకం చేయగలరని కోరారు. వారు సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.

# జర్నలిస్టుల కోసమే.. జాప్!



- *అట్టహాసంగా 33వ ఆవిర్భావ దినోత్సవం
- *హాజరైన అతిరథమహారధులు
- *అన్ని వేళలా అండగా నిలుస్తా
- *శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్
- *జిల్లా కమిటీ సారథ్యంలో పాత్రికేయులకు సన్మానం

**శ్రీకాకుళం నగరం, నవంబరు 19(వార్త):** సిక్కోలులో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) జాప్ త్రయాత్ర కొనసాగుతోంది. జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతున్న ఈ సంఘం..33వ వార్షికోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించింది. క్రమం తప్పకుండా జర్నలిస్టుల సేవలో తరిస్తోంది. సంఘాన్ని నమ్ముకున్న జర్నలిస్టులకు అండగా నిలుస్తోంది. పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తూనే ఉంది. విలేకరుల సేవలో తన ప్రత్యేకతను ఎప్పటికప్పుడు చాటుకుంటోంది. కష్టాల్లో ఉన్న జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవటంతో పాటు ఆపన్నుల సేవలో తరిస్తోంది. ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలుస్తోంది. మారుతున్న కాలం, సమాజానికి అనుగుణంగా జర్నలిస్టులను తీర్చిదిద్దటంలో తనదైన పాత్ర పోషిస్తోంది. సామాజిక మాధ్యమాల ట్రెండ్‌లోనూ..నిఖార్సైన జర్నలిజం వైపు అడుగులు వేస్తోంది. జాప్ జిల్లా అధ్యక్షుడు జి.షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి గంజి ఎజ్రా, రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్. నాగభూషణరావు, ఓంపూరు రమేష్, బాలకృష్ణ పట్నాయక్, జిల్లా కమిటీ బాధ్యులు టెంక.శ్రీనివాస్, ఆర్.బాలకృష్ణ, కె.సునీల్, రౌతు.సూర్యనారాయణ, జి.సూర్యనారాయణ, సీపాన.రమేష్‌కుమార్, మరో 40 మంది జర్నలిస్టుల సాయంతో.. సామాజిక సేవలో తరిస్తోంది. ప్రజాప్రతినిధులు, ప్రముఖుల నుంచి మన్ననలు అందుకుంటోంది. సమావేశానికి వచ్చిన ఓ పెద్ద మనిషి.. జర్నలిస్టులు అంటే వీరు..సంఘం అంటే ఇదీ..అన్నారంటే..జాప్ సేవలు ఎంతలా చేరువయ్యాయో.. ఇట్టే చెప్పవచ్చు. దీనికి నిదర్శనమే బుధవారం శ్రీకాకుళం నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో జరిగిన జాప్ ఆవిర్భావ దినోత్సవం. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పాత్రికేయుల నడుమ జాప్ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. సిక్కోలులో జాప్‌ను నడిపిస్తున్న ప్రతినిధులను, సంఘం సేవలను ప్రముఖులు కొనియాడారు.

### జర్నలిస్టులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే శంకర్

సమాజహితం కోసం పనిచేస్తున్న జర్నలిస్టులకు అండగా నిలుస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చెప్పారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన.రవికుమార్‌ల సాయంతో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచే జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందని చెప్పారు. వ్యక్తిగత అంశాల కన్నా సామాజిక చైతన్యానికి జర్నలిజం దోహదపడాలని ఆయన అభిప్రాయ పడ్డారు. జాప్ జిల్లా అధ్యక్షుడు జి.షణ్ముఖరావు అధ్యక్షతన నగరంలో స్థానిక సన్‌రైజ్ హోటల్‌లో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 33వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ మారుతున్న ప్రస్తుత తరుణంలో జర్నలిస్టులు కూడా వాటిని అందిపుచ్చుకుని చక్కని ప్రజాహితంతో కూడిన వార్తలను అందించాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే సహకారం పూర్తిస్థాయిలో అమలు జరిగేలా తనవంతు కూడా కృషి చేస్తానని తెలిపారు. 33 ఏళ్లుగా జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత కోసం జాప్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

### అక్షరం.. ఓ ఆయుధం



జర్నలిస్టులు రాసే ప్రతి అక్షరం ఓ ఆయుధమని..అవి ఆకాశానికి ఎత్తేయగలవు.. అధ:పాతాళానికి తొక్కేయగలవు అని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు పేర్కొన్నారు. తాము చేస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడంలో పత్రికలు ముందున్నాయని ప్రశంసించారు. తన లాంటి వారు..నాయకులుగా ఎదిగేందుకు ఎంతో పత్రికలు, చానెళ్లు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి..పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమస్యలను తన దృష్టికి తేవాలన్నారు. అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు.నరేంద్రయాదవ్ ఆకట్టుకునే ప్రసంగం చేశారు. జర్నలిస్టుల కష్టాలను వివరిస్తూ..జర్నలిస్టులతో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి చట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జర్నలిస్టులు తప్పు చేస్తే..చర్యలు తీసుకునేందుకు ఏర్పాటైన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా..జర్నలిస్టుల సంక్షేమానికి కూడా పాటుపడాలన్నారు. ప్రముఖ వైద్యులు బగ్గు.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కులం, మత, జాతితో సంబంధం లేకుండా దేశ ప్రయోజనాల కోసం పనిచేసిన ఎందరో జర్నలిస్టులు చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వారి స్ఫూర్తిగా ముందుకు సాగాలని,వారికి బతుకుపై భరోసా కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ విద్య, మౌళిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ పీఎంజేబాబు, ఆదివాసీ నేత వాబయోగి, టీడీపీ నగర అధ్యక్షులు పాండ్రంకి శంకర్, లైన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి.సింధూర మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఆలోచనా విధానం అక్షరంపై ఎంతో ప్రభావం చూపిస్తోందని తెలిపారు. ప్రభుత్వాలను శాసించే స్థాయికి జర్నలిజం ఎదిగిన నేటి రోజుల్లో ఐకమత్యంగా ఉంటూ జర్నలిస్టులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జాప్ జిల్లా అధ్యక్షులు జి.షణ్ముఖరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, మీడియా జేఏసీ కన్వీనర్ శాసపు జోగినాయుడు మాట్లాడుతూ..జర్నలిస్టుల సమస్యలు ఏకరువు పెట్టారు. ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. అన్ని జర్నలిస్టుల సంఘాలు కలసి ఇప్పటి వరకు లబ్ధిపొందని జర్నలిస్టులను గుర్తిస్తామని, వారికి ఇళ్లస్థలాలు మంజూరు చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం సీనియర్ పాత్రికేయులకు ఎమ్మెల్యే చేతులమీదుగా దుశ్శాలువలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. అతిథులను గౌరవించారు. తొలుత కేక్‌ను కట్‌చేసి జాప్ ఆవిర్భావ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోకతోట సింహాచలం, వైసీపీ యువజన నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్, జాప్ నేతలు పక్కి వేణుగోపాల్, శ్రావణ్, ఎం.రాధాకుమారి, బలగ మోహన్, పరిడాల సాయి, మణి, వైకుంఠరావు, కళ్యాణ్, బాసూరు సాయి, శ్యామ్‌కుమార్, బీఎస్ఎస్ శర్మ, టి.వైకుంఠ రావు, బి.జయవర్ధన్, దుబ్బ.రాజగోపాల్, జి.రాంబాబు, సత్యం రామకృష్ణతో పాటు పెద్దఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు.



## పాతపట్నంలో సమస్యల పరిష్కారానికి కృషి

- కొరికాన ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు
- జనసేన పార్టీ బలోపేతానికి కృషి
- సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జనసేన సీనియర్ నాయకురాలు భవాని





**ఎల్ఎన్ పేట, నవంబరు 19(వార్త):** పాతపట్నం నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సుడా చైర్మన్ కొరికాన.రవికుమార్, జనసేన సీనియర్ నాయకురాలు కొరికాన భవాని అన్నారు.సోమవారం మండలంలోని మిరియాపల్లి గ్రామం లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.కూటమి ప్రభుత్వం గ్రామాలు మౌళిక సౌకర్యాలు అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.జనసేన పార్టీ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో సమస్యలు గుర్తించి వాటికి అనుగుణంగా గా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సుల తో నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకురాలు కొరికాన భవాని ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.జనసేన పార్టీ విధానాలు పట్ల ఆకర్షితులై పార్టీ లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని, వారిని పార్టీలో చేర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.గ్రామస్థాయి నుండి కార్యక్రమాలు చేపట్టి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు.ఇప్పటికే తమ దృష్టికి వచ్చిన పలు సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.కొరికాన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సేవాకార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.త్రాగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.యువత ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించడానికి కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.వీటితో పాటు సామాజిక, ఆద్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు.నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల్లో అయ్యప్ప స్వాములు సామూహిక మహా పడి పూజలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భవిస్యత్తులో నియోజకవర్గం లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే ఆలోచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## శ్రీ సత్య సాయి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి



**పలాస, నవంబరు 19(వార్త):** పలాస శ్రీ సత్యసాయి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, మహిళల దినోత్సవం వేడుకలను ఘనంగా బుధవారం నిర్వహించారు. నగర సంకీర్తన చేస్తూ ఇందిరాగాంధీని తలుచుకుంటూ, మహిళా దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి ప్రతి సంవత్సరం నవంబరు 19న జరిగినా, అందుకు సంబంధించిన ప్రధాన వేడుకలు, చరిత్రను నగర సంకీర్తనలు వివరించారు. ఇందిరాగాంధీ భారత దేశంలో ముఖ్యమైన రాజకీయ నాయకురాలు, భారత ప్రధాని పదవికి రెండు సార్లు ఎన్నికై, సమాజ అభివృద్ధి, మహిళల సాధికారతపై యథార్థ సేవలు చేసినవారు. జయంతి సందర్భంగా ఆయా కార్యక్రమాలు, స్మారక సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు పఠనలు నిర్వహిస్తారు.ఈ రోజు ఆమె గొప్ప కృషి, నాయకత్వానికి నివాళులర్పించి, యువతలో ప్రేరణ ఇవ్వడంలో ముఖ్యమైన దినంగా గుర్తింపు పొందిందిని చెప్పారు. మహిళల దినోత్సవం వేడుకలు (అంతర్జాతీయ మహిళల దినోత్సవం)అంతర్జాతీయ మహిళల దినోత్సవం ప్రతి ఏడాది మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుగుతుందిని అన్నారు. ఇది మహిళల సాధికారత, సమానత్వం, పురుషుల సహకారం మరియు సామాజిక అవరోధాల తొలగింపుపై దృష్టి సారించే వేడుకగా ఉందని చెప్పారు. భారతదేశం లోనూ ఈ రోజును సాంస్కృతిక ప్రదర్శనలు, వక్తృత్వాలు, గురువులు, విజయవంతమైన మహిళల పాత్రలను హైలైట్ చేసే కార్యక్రమాలతో జరుపుకుంటారు. పతాక ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలు, వృత్తిపరమైన గమనాలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారు.

# రైతు పక్షపాత ప్రభుత్వమిది

- -పలాస ఎంఎల్‌ఏ గౌతు శిరీష
- -భోగాపురంలో అన్నదాత సుఖీభవ నిధుల జమ
- -ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- -ప్రకృతి వ్యవసాయం కిట్లు పంపిణీ





**మందస, నవంబరు 19(వార్త):** కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతే రాజు అనే మాట ఒక నినాదంగా మిగలకూడదని, ఆ రైతుని అన్ని విధాల ఆదుకోవాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చఅంతో ఉందని పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. భోగాపురంలో జరిగిన 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతే రాజు అనే మాట ఒక నినాదం గాను మిగలకూడదని ఆ రైతుని అన్ని విధాల ఆదుకోవాలని కూటమి ప్రభుత్వం కృతనిత్యంతో ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం సాగు నీరు కూడా సకాలంలో అందించలేదని, రైతులను ఏ విధంగా కూడా ఆదు కోలేద న్నారు. రైతులు అమ్ముకున్న ధాన్యానికి వారికి చెల్లించవలసిన డబ్బులు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించడం జరి గిందన్నారు. రైతులకు గత ప్రభుత్వం 13,000 రూపాయలు చొప్పున చెల్లిస్తే ప్రస్తుత ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రంలో 47లక్షల మందికి 20,000 రూపాయలు చొప్పున ఇస్తామని చెప్పి, రెండు విడతలలో 14,000 రూపాయలు చెల్లించారన్నారు. రాష్ట్రం అనేక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో ప్రారంభించారన్నారు. పలాస నియోజకవర్గంలో కూడా రైతులందరూ ఆనందంగా ఉండాలని, మీ అందరి ముఖంలో ఆనందం చూడాలని.. భోగపురంలో పండగ వాతావరణంలో కార్యక్ర మం నిర్వహించామన్నారు. మున్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళదామని, మీరంతా కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం కిట్లు పంపిణీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి మధుసూదనరావు, ఆర్డీఓ వెంకటేష్, వ్యవసాయశాఖ ఏడీఏ మండేలా రామారావు, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల తహసీల్దారులు, ఎంపీడీఓలు, వ్యవసాయాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546